- సింగరేణి కారుణ్య నియామకాల వయసు 40 ఏండ్లకు పెంచుతాం..
- కాంగ్రెస్ హయాంలో ఎట్లున్న గోదావరి నది ఇప్పుడు ఎట్లైంది..
- మంచిర్యాల ప్రజలు మంచివాళ్లనే కోరుకుంటారు.. లంగలను, దొంగలను నమ్మరు..
- రెవెన్యూ డివిజన్‌గా ఉన్న మంచిర్యాలను జిల్లా చేసింది ముఖ్యమంత్రి కేసీఆర్..
- దివాకరన్నను భారీ మెజార్టీతో గెలిపిస్తే ఐటీ హబ్ ఇచ్చే బాధ్యత నాది
- రోడ్‌షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

# ఐటీ హబ్ కావాల్నా.. పేకాట క్లబ్ కావాల్నా..


మంచిర్యాల రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

మంచిర్యాల, నవంబర్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాలలోని అక్కలు, అన్నలు, తమ్ముళ్లు, చెల్లెళ్లు మీకు ఐటీ హబ్ కావాల్నా.. పేకాట క్లబ్ కావాల్నా.. తేల్చుకోండి.. అని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఐటీ హబ్ కావాలంటే కారు గుర్తుకు ఓటేయండి. పేకాట క్లాబ్ కావాలంటే మీ ఇష్టమని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాలలో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివాకరన్న అడిగిన ఐటీ హబ్ కావాల్నా.. లేక పేకాట క్లాబ్ కావాల్నా.. కరెంట్ కావాలా.. కాంగ్రెస్ కావాలా.. ఆలోచించాలన్నారు. స్కీమ్‌లు కావాలంటే కారు గుర్తుకు ఓటేయండని, స్కామ్‌లు కావాలంటే ఆ సన్నాసి కాంగ్రెస్‌కు ఓటు వేయండన్నారు. రైతుబంధు కావాలంటే దివాకరన్నకు ఓటు వేయండి.. కాదనుకుంటే ఆ రాబంధులకు ఓటు వేయండన్నారు. ఇందులో సిగ్గుపడే ముచ్చట ఏం లేదని కారు కావాల్నా.. బేకారు గాళ్లు కావాల్నా.. మంచిర్యాలను ముంచేద్దమా.. ఎవ్వల చేతుల్లో పడితే వాళ్ల చేతుల్లో పెడుదామా.. ఆలోచించుకోవాలన్నారు. ఇందాక దివాకరన్న మాట్లాడుతూ.. బాగా ఆవేశపడ్డారన్నారు. గంత ఆవేశపడే పరిస్థితి ఏం లేదని, మీరు పక్కా గెలుస్తున్నరని చెప్పారు. మంచిర్యాల ప్రజలు మంచిని, మంచివాళ్లను కోరుకుంటారని, లంగలను దొంగలను నమ్మరని మీరేం భయపడొద్దన్నారు.

### 40 ఏండ్లు తల్లాడినా మంచిర్యాలను పట్టించుకోలే..

తెలంగాణ వచ్చిన తొమ్మిదిన్నరేండ్లలో మంచిర్యాలలో జరిగిన మార్పులు మీ కండ్ల ముందే కనబడుతున్నాయన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 2014 దాకా మీరు 40 ఏండ్లు తండ్లాడినా ఎన్నడూ పట్టించుకోలేదు. ఏ కాంగ్రెస్ నాయకుడు ఆనాడు మంచిర్యాల కోసం కనీస ఆలోచన కూడా చేయలేదన్నారు. రెవెన్యూ డివిజన్‌గా ఉన్న మంచిర్యాలను ఇవాళ జిల్లా చేసిన నాయకుడు మన ముఖ్యమంత్రి కేసీఆరా.. కాదా.. ఒక్కసారి ఆలోచించాలన్నారు. ఆనాడు మంచిర్యాలలో ఒక రైతుకు సమస్య ఉండి కలెక్టర్‌ను కలవాలంటే.. ఆదిలాబాద్‌కు పోవాల్సి వస్తుండేనన్నారు. వందల కిలోమీటర్లు జంగల్ మీద నుంచి ఆదిలాబాద్ పోయేందుకు ఎన్ని అవస్థలు పడ్డామో గుర్తు చేసుకోమన్నారు. ఇవాళ మంచిర్యాలలో దివాకర్‌రావును గెలిపించుకొని, కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసుకున్నాక.. మంచిర్యాలలోనే అద్భుతమైన కలెక్టరేట్‌ను జిల్లా అధికారులను తెచ్చుకున్నామన్నారు. అప్పుడు ఎట్లుండే మంచిర్యాల.. ఇప్పుడు ఎట్లైందో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. ఆ నాడు అరవింద రెడ్డి నాయకత్వంలో మంచిర్యాలలో ఉద్యమం జరిగినప్పుడు చాలా సార్లు వచ్చానని, ఆ రోజు ఆయన ఇంటి ఎదుట చూసిన అదే గల్లీ ఇవాళ ఎట్లా అయ్యిందో చూడాలన్నారు. ఇదే మెయిన్ రోడ్డు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలా ఉంటే, ఇవాళ ఎట్లైంది మీ కండ్లతోని చూసి, మనసుతో ఆలోచించాలన్నారు. మంచిర్యాల జిల్లా అవ్వడంతోపాటు అన్ని హంగులు సంపాదించుకొని బ్రహ్మాండంగా అభివృద్ధిలో ముందుకుపోతున్నదన్నారు.

### సింగరేణికి ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చింది సీఎం కేసీఆర్..

మంచిర్యాల సింగరేణి మీద ఆధారపడిన పట్టణమని మంత్రి కేటీఆర్ అన్నారు. సింగరేణి కార్మికుల చెమట, రక్తంతో నడిచే పట్టణం ఇది అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాకే సింగరేణి కార్మికులకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 32 శాతం బోనస్ ఇచ్చామన్నారు. దీపావళి, దసరాకు రూ.1000 కోట్ల బోనస్ ఇచ్చిన ముఖ్యమంత్రి ఒక్క కేసీఆర్ తప్ప ఇంకెవరన్న ఉన్నరా.. ఆలోచించాలన్నారు. సింగరేణి కార్మికులకు వారసత్వ ఉద్యోగాలపై అందరూ మాటలు చెప్పినోళ్లే తప్ప, నిలుపుకున్నోళ్లు ఎవరూ లేరన్నారు. కేసీఆర్ వచ్చాక కారుణ్య నియామకాలు, వారసత్వ ఉద్యోగాలు ఇచ్చింది వాస్తవమా కాదా.. ఆలోచించాలన్నారు. కారుణ్యనియామకాలకు వయస్సు 40 ఏండ్ల దాక పెంచాలని అడుతున్నారని, డిసెంబర్ 3వ తేదీన దివాకర్‌అన్నను గెలిపించండి తప్పకుండా ఆ పని చేసి చూపిస్తామన్నారు. ముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చిన రోజు సింగరేణి కార్మికులకు పది హామీలు ఇచ్చారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నారని మరి అలాంటి ముఖ్యమంత్రికి మద్దతు ఇవ్వాలా.. వద్దా... మీరే నిర్ణయించాలన్నారు. 2014లో ఇదే మంచిర్యాలలో ప్రతి షాప్‌కో ఇన్వర్టర్, జనరేటర్ లేకుండేనా.. ఒకసారి యాద్ చేసుకోవాలన్నారు. ఆనాడు కరెంట్ కష్టాలు ఎట్లా ఉండేనో గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఏదన్న ఊరిలో పెద్ద మనిషి సచ్చిపోతే కరెంటోళ్లకు ఫోన్ చేసి మా పెద్దమనిషి సచ్చిపోయిండు. బాయి కాడికి పోయి స్నానం చేయాలే. కరెంట్ లేదు. ఒక 20 నిమిషాలు కరెంట్ ఇవ్వండని దండం పెడతామని అని బతిలాడుకున్నది వాస్తవమైతే కాంగ్రెస్ పార్టీకి సిగ్గు వచ్చేటట్లు చేయాలన్నారు. ఇక్కడున్న గోదావరి కాంగ్రెస్ హయాంలో ఎట్లా ఉండేనో యాది తెచ్చుకోవాలన్నారు. ఇవాళ దివాకర్‌రావు కరకట్టలు కావాలి అనేంతగా దాన్ని బాగు చేసుకన్నామన్నారు. ఆనాడు కాంగ్రెసోళ్లు గోదావరిని ఎండబెడితే ఇవాళ గోదావరి నిండుగా పారేట్లు చేసింది కేసీఆర్ కాదా.. ఆ నాడు రామగుండం-మంచిర్యాలను కలిపే బ్రిడ్జిపై నుంచి గోదావరిలో ఒక పైసా వేయాలంటే నీళ్లు ఏడున్నయ్ అని దేవులాడాల్సి వస్తుండేని, ఇవాళ సముద్రంలా గోదావరి ఉన్న మాట వాస్తవం కాదా.. ఇవన్ని మీ కండ్ల ముందు లేవా.. చూడాలన్నారు.

### మెడికల్ కాలేజీ తెచ్చినం..

మంచిర్యాలకు ఒక డిగ్రీ కాలేజీ కావాలంటే, జూనియర్ కాలేజీ కావాలంటే ధర్నాలు, రాస్తారోకోలు చేసిన రోజులు మర్చిపోవొద్దని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. 55 ఏండ్ల దరిద్రపు కాంగ్రెస్ పాలనలో డిగ్రీ కాలేజీ రాలేదు, జూనియర్ కాలేజీ రాలేదన్నారు. అట్లాంటి మంచిర్యాలకు ఇవాళ మెడికల్ కాలేజీ తెచ్చింది కేసీఆర్ కాదా.. మరి ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెసోళ్లు ఓట్లు అడుగుతున్నరో చెప్పాలన్నారు. కరెంట్, తాగునీరు, సాగునీరు సక్కగ ఇయ్యలే. ఒక్క కాలేజీ తేలే.. పట్టణం బాగు చేయలే.. పల్లెలు బాగు చేయలే.. ఏదీ కూడా బాగా చేయని దరిద్రులు మళ్లీ వచ్చి ఇవాళ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నరని, నోటికి వచ్చినట్లు వాగుతున్నారని మండిపడ్డారు. మన ఇంట్లో ఒక పెండ్లీడుకు వచ్చిన ఆడపిల్లకు పెండ్లి చేయాలంటే ఎంత ఆలోచన చేస్తాం. ఇయ్యబోయే పిల్లగానికి ఏమన్న లంగ, దొంగ లక్షణాలు ఉన్నయా? వాడు సిగరేట్ తాగుతడా లేక మందు కొడుతడా.. పత్తాలు ఆడుతడా.. ఇవ్వన్ని చూస్తమా చూడమా.. అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. వానికేమన్న లంగ అలవాట్లు ఉంటే పిల్లను ఇస్తమా.. ఇవ్వంగదా.. మరి ఒక ఇంట్ల అమ్మాయి పెండ్లి చేసేప్పుడు గంత ఆలోచించే మనం.. మంచిర్యాలను ఎవరి చేతుల్లో పెడుతమో ఆలోచించొద్దా.. ఎవ్వరికి పడితే వాళ్లకు ఓటేసి తర్వాత తన్నించుకుందామా.. ఆలోచించాలన్నారు. జాగ్రత్తగా ఆలోచించి తొందరపడకుండా ఓట్లు వేయాలన్నారు.

### అలిగినా.. గులిగినా.. మనోళ్లకు ఓట్లు వేయాలే

దివాకర్‌రావు మొన్న గట్ల పోతుంటే నేను నమస్తే పెట్టిన.. నాకు ఆయన నమస్తే పెట్టలేదని, దివాకరన్న నేను లగ్గానికి పిలిస్తే రాలేదని, పక్కింటోని దళితబంధు ఇచ్చిండు నాకు ఇయ్యలేదని, కొంత మందికే రేషన్ కార్డు వచ్చింది నాకు రాలేదని.. ఇసోంటి గులుగుడు, అలుగుడు అక్కడక్కడ ఉంటాయని మంత్రి కేటీఆర్ అన్నారు. ఒక ఊళ్లకు పోతే 500 మందికి పింఛన్లు వస్తుంటాయ్, రానోళ్లు ఓ 20 మంది ఉంటరు.. ఈ 500 మందేమో మంచిగ కడుపులో సల్ల కదలకుండా కూసుంటరు. ఈ ఇరవై మంది లొల్లి పెడుతుంటరు. నాకు పింఛన్ రాకపోయే.. పింఛన్ వస్తలేదని.. వాళ్లు చేసే లొల్లి చూసేటోళ్లకు ఏట్లనిపిస్తదంటే ఎవ్వనికి వస్తలేదా.. ఈ ఊళ్లో పింఛన్ అనిపిస్తదని, కానీ.. వాస్తవానికి వేరే ఉంటుందన్నారు. నేను మిమ్ములందరినీ కోరేది ఒక్కటేనని అలిగినా, గులిగినా, నారాజైనా మనోళ్లతోనే పని చేయించుకోవాలన్నారు. మంచిర్యాలలో జోరుగా బిల్డింగ్‌లు, షాపులు కట్టారని మరి రేపటి రోజున అడ్డమైనోళ్లను ఓట్లు వేస్తే ఒక్కొక్క షాప్ మూతపడే పరిస్థితి వస్తుందన్నారు. మంచిర్యాలలో అట్లాంటి దుర్మార్గులను గెలిపించవచ్చునా.. అలాంటి వారి గురించి ఆలోచించవచ్చునా.. ఆలోచించాలన్నారు. రెండు టర్మ్‌లు కేసీఆర్ బాగానే చేశారు, కల్యాణలక్ష్మి-షాదీ ముబారక్ ఇచ్చారు, కేసీఆర్ కిట్లు ఇచ్చారు, మంచిర్యాలకు మెడికల్ కాలేజీ ఇచ్చారు, 30 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చారు, గోదావరిని బ్రహ్మాండంగా చేశారు, మంచిర్యాలను జిల్లా చేశారు, ఇవన్ని బాగానే ఉన్నయ్ కానీ రేపు ఏం ఇస్తారనుకునేటోళ్లు, ఇక్కడికి వచ్చిన ఆడబిడ్డలు జాగ్రత్తగా ఈ విషయం వినాలన్నారు. డిసెంబర్ 3 తరువాత కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయ్యాక, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు గెలిచాక.. ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.3వేల సౌభాగ్య లక్ష్మి అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఆసరా పింఛన్లను రూ.5వేలకు పెంచబోతున్నామన్నారు. రైతుబంధును రూ.10 వేల నుంచి రూ.16 వేలు చేసుకోబోతున్నామన్నారు. నరేంద్ర మోదీ రూ.400 సిలిండర్‌ను రూ.1200 చేశారని, ఈ సారి గెలిస్తే తప్పకుండా ఆ పెంచిన రూ.800ను రాష్ట్ర ప్రభుత్వం భరించి రూ.400కే సిలిండర్ ఇస్తుందన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ దొడ్డు బియ్యం బదులు, సన్న బియ్యం ఇస్తామన్నారు. రైతుబీమా లెక్కనే కేసీఆర్ బీమా తీసుకువస్తున్నామని చెప్పారు. నిజంగా మీకు ఐటీ హబ్ కావాలంటే దివాకరన్నను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మంచిని ఆశీర్వదించాలని, పనిచేసే నాయకులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అందరి మీద ఉన్నట్లే దివాకరన్న మీద గులుగుడు, అలుగుడు ఉంటాయన్నారు. ఎప్పటికైనా మనోడు మనోడే అయితాడన్నారు. మన పార్టీ మన పార్టీ అయితదని, ఢిల్లీ వాడు మనోడు ఎన్నటికీ కాడన్నారు. దివాకరన్న మీద గులిగినా, అలిగినా.. గులుగుడు గులుగుడే.. మళ్ల గుద్దుడు గుద్దుడే అన్నారు. మనోళ్లను గెలిపించుకోవాలే తప్ప మన జుట్టు ఎవ్వడో హౌలా గానీ చేతిలో, ఢిల్లీ పార్టీల చేతిలో పెట్టొదన్నారు. మంచిగా ఉన్న మంచిర్యాలను కాపాడుకోవాలే తప్ప, ఆగం కావొద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేశ్ నేతకాని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరవిందరెడ్డి, మున్సిపాల్టీల చైర్మన్లు పెంట రాజయ్య, ప్రభాకర్, కాంతయ్య, యూత్ నాయకుడు విజిత్‌రావు పాల్గొన్నారు.




★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




# 'మంచి'ర్యాలను నిలబెట్టుకుందాం

- కాంగ్రెస్ వస్తే మొదటికే మోసం
- ఈ ప్రాంత అభివృద్ధికి మంత్రి కేటీఆర్ ఎంతో సహకరిస్తున్నారు..
- ఐటీ హబ్, ఇంజినీరింగ్ కాలేజీ, కరకట్టలు సాధించుకుందాం
- కారు గుర్తుకు ఓటేస్తేనే అభివృద్ధి సాధ్యం
- రోడ్‌షోలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు


మాట్లాడుతున్న మంచిర్యాల అభ్యర్థి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, నవంబర్ 17: మంచిర్యాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, దీనిని ఇలాగే నిలబెట్టుకుందామని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంచిర్యాలలో శుక్రవారం మంత్రి కేటీఆర్ తో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. బెల్లంపల్లి చౌరస్తా వద్ద మాట్లాడారు. మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి కేటీఆర్ ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్నారని చెప్పారు. గతంలో ఎండాకాలం వస్తే గోదావరి ఎండిపోయేదని, నేడు నిండుకుండలా ఉన్నదంటే దానికి కారణం సీఎం కేసీఆరేనన్నారు. గూడెం, పడ్తనపల్లి లిఫ్టల ద్వారా మంచిర్యాల నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజలు కోరుకున్న మంచిర్యాల జిల్లా ఏర్పాటును కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టగానే తీర్చారని, జిల్లా కేంద్రంలో పాటు మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ కూడా ఇచ్చారన్నారు. ఈప్రాంతంలో 3500 మందికి సింగరేణిలో కారుణ్య ఉద్యోగాలు ఇచ్చారని, సింగరేణి స్థలాల్లో నివసించే 3500 కుటుంబాలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. వానకాలంలో ప్రతిసారి మంచిర్యాలలోని లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయని, అందుకే గోదావరి, రాళ్లవాగులకు కరకట్టలు నిర్మించాలని మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే కోరారు. ఈ ప్రాంత యువత కోసం ఐటీ హబ్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. ఇంజినీరింగ్ విద్యకోసం అందరూ హైదరాబాద్, ఇతర దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నదని, అందుకే మంచిర్యాలలో ఒక ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీని ఏర్పాటుచేయాలని కోరారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ వస్తే దౌర్జాన్యాలు, గూండాయిజం, రౌడీయిజం మాత్రమే ఉంటుందన్నారు. పేకాట క్లబ్‌లు నడపడం, ఎందరినో మోసం చేసి రూ. 800 కోట్లు బ్యాంకుల్లో అప్పులు చేసిన వ్యక్తి ప్రేంసాగర్‌రావు అని, అతడికి ఓటేస్తే ఏం జరుగుతుందో అందరూ ఆలోచించాలని కోరారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని ఆయన ఓటర్లను కోరారు.